క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పిస్తాం

జెడ్పీటీసీ మర్రి నిత్యారెడ్డి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నిత్యారెడ్డి

మంచాల: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంచాల జెడ్పీటీసీ మర్రి నిత్యారెడ్డి అన్నారు. శుక్రవారం మంచాల మండలంలోని రంగాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ.4.50లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. అదే విధంగా శ్మశానవాటిక వద్ద నీటి సదుపాయం కోసం రూ.1.05లక్షతో బోరు వేయించారు. ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా పేదలకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మమత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద యువతి పెళ్లికి చేయూత



ధనలక్ష్మికి పట్టుచీర, బియ్యం అందజేస్తున్న జ్యోతి

యాచారం: గ్రామంలోని నిరుపేదలకు అండగా ఉంటానని, ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతినాయక్ అన్నారు. గ్రామానికి చెందిన రమావత్ శారద, నారాయణ దంపతుల కూతురు ధనలక్ష్మీ పెళ్లి వేడుక శనివారం జరగనుంది. శారద, నారాయణ దంపతుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం గ్రామంలోని వారింటికి వెళ్లి ఒక పట్టు చీర, క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు అరవింద్‌నాయక్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదయ్య, నాయకులు అఖిల్‌ఖాన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

యాచారం: కొత్తపల్లి గ్రామంలోని బొక్కల కంపెనీని మూసేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేస్తున్న నిరాహార దీక్ష శుక్రవారానికి 9వ రోజుకు చేరింది. తొమ్మిదిరోజులుగా దీక్ష చేస్తున్నా అధికారుల్లో స్పందన లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కంపెనీని మూసేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్టు లైట్ల ఏర్పాటు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో శుక్రవారం రాత్రి హైమాస్టు లైట్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో ఎమ్మెల్సీ బోగారపు దయానంద్ తన ఎమ్మెల్సీ నిధుల నుంచి మంజూర్ చేసిన రూ.5 లక్షలతో హైమాస్టు లైట్లను ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి యాదయ్య, దస్తగిరి, ప్రకాశ్, అభిలాష్‌గౌడ్, శ్రీశైలం, రవి, సుదాకర్, ఆంజనేయులు, తిరుపతి పాల్గొన్నారు.

గ్రీన్ జోన్ ఎత్తివేయాలని కలెక్టర్‌కు వినతి

బడంగ్‌పేట్: పట్టణ పరిధిలోని అల్మాస్‌గూడలో చాలా కాలనీలు గ్రీన్‌జోన్‌లో ఉన్నాయని, వాటిని రెసిడెన్సియల్ జోన్‌లోకి మార్చాలని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నేత రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, భూ యజమానులు కలిసి శుక్రవారం కలెక్టర్ హరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి సబితారెడ్డి సూచన మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. అల్మాస్‌గూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 122, 123, 124, 129లో వెయ్యి కుటుంబాలు గ్రీన్ జోన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సర్వే నంబర్లలో సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోవడానికి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని తెలిపారు. గతంలో పంచాయతీ అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్న వారు అదనపు అంతస్తుల నిర్మించుకోవడానికి అనుమతులు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రీన్ జోన్ పరిధిలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వ బ్యాంకుల్లో గృహ రుణాలు రావడం లేదని, ప్రైవేట్ బ్యాంకుల్లో అధిక వడ్డీకి రుణాలు తీసుకోవాల్సి వస్తోందన్నారు. పిల్లల చదువుల కోసం, వివాహాల కోసం ఖాళీ స్థలాలు కొన్నారని, ప్రస్తుతం వాటి విలువ భారీగా పడిపోయిందన్నారు. గ్రీన్ జోన్ ప్రాంత వాసులు అన్ని ప్రాంతాల వారితో సమానంగా పన్నులు కడుతున్నా అనుమతుల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తెచ్చినా (పరిష్కారం కాలేదని తెలిపారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మోహన్, మాధవరెడ్డి, శశికాంత్,వీరాచారి, బహుగుణనాయక్ పాల్గొన్నారు.

బాలయేసు క్షేత్రానికి వెళ్లొద్దామా..

- వార్షిక మహోత్సవానికి సిద్ధమైన పుణ్యక్షేత్రం
- ఈనెల 11, 12 తేదీల్లో ఉత్సవాలు
- ఏర్పాట్లను పూర్తిచేసిన నిర్వాహకులు
- ప్రత్యేక బస్సులు నడపనున్న ఆర్టీసీ



కమ్మగూడలోని బాలయేసు పుణ్యక్షేత్రం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని అద్భుత బాలయేసు పుణ్యక్షేత్రం వార్షిక మహోత్సవానికి ముస్తాబైంది. ప్రతి ఏటా ఫిబ్రవరి నెల 2వ వారంలో బాలయేసు మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగానే ఈనెల 11, 12 తేదీల్లో మహోత్సవాలు నిర్వహించనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మొట్టమొదటగా కమ్మగూడలో బాలయేసు పుణ్యక్షేత్రాన్ని నిర్మించారు. మొత్తంగా దేశంలో ఇది మూడవది. బయట నుంచి చూస్తే ఈ పుణ్యక్షేత్రం మత్స్య ఆకారంలో కనిపిస్తుంది.లోపల భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

విస్తరణ, పునర్నిర్మాణం

ఈ క్షేత్రానికి నగరం నుంచే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తుల తాకిడి పెరగడంతో 1992లో ఆలయ విస్తరణను చేపట్టారు. 100 అడుగుల ఎత్తులో ధవళ వర్ణంతో రెండు గాలిగోపురాలను ఏర్పాటు చేశారు. 150 కిలోల కంచు గంట అమర్చారు. రెండు గాలిగోపురాల మధ్య సింహద్వారం ఉంటుంది. భారతీయ కళా సంపద ఉట్టిపడే విధంగా 70 అడుగుల ఎత్తులో ఒక గుహగోపురం తీర్చిదిద్దారు. 'నీవు నన్ను ఆరాధిస్తే నేను నిన్ను ఆదరిస్తా' అన్న బాలయేసు మాటలను గోడలపై లిఖించారు. దేవమాత గుహతో పాటు దర్శించుకునే ప్రదేశాలు ఇక్కడ చాలా ఉన్నాయి. ప్రతి ఏటా మహోత్సవాలకు 50వేలకు పైగా భక్తులు హాజరవుతుంటారు. వారికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తారు.

రెండురోజులు ప్రత్యేక కార్యాక్రమాలు

ఈ నెల 11న (శనివారం) ఉదయం 7గంటలకు పాస్టర్ కె.రాజశేఖర్ గారిచే ఫలమంతమైన జీవితం జీవించటం దివ్య బలిపూజ (తెలుగు), సాయింత్రం 5గంటలకు పాస్టర్ జి.ఆరోగ్య స్వామిచే ఆరాధన, వాక్య పరిచర్య, దివ్య బలిపూజ, దేవుని బిడ్డల చిహ్నాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 4 గంటల నుంచే కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి. పాస్టర్ ఉడుముల జె.చిన్నప్పరెడ్డి , విచారణ గురువు, యంజాల గారిచే తెలుగులో దివ్య బలిపూజ, 5 గంటలకు పాస్టర్ వి.రాజేషచే దివ్య బలిపూజ నిర్వహించనున్నారు. 6 గంటలకు నగరంలోని బోయిగూడ నుంచి బాలయేసు తేరు ప్రదక్షిణ ఆరంభం కానుంది. ఉదయం 6 గంటలకు కె.జోసెఫ్ తంబిచే ఇంగ్లీష్‌లో దివ్య బలిపూజ, 7 గంటలకు జె.రవి లుకాస్‌చే దివ్య బలిపూజ తెలుగులో, 8 గంటలకు అంతువాన్ రొసారియోచే తమిళంలో దివ్య బలిపూజ, 9 గంటలకు పాస్టర్ అల్లం ఆరోగ్యరెడ్డిచే బాలయేసు మహోత్సవ దివ్య బలిపూజ (ఇంగ్లీష్), 11 గంటలకు కార్డినల్ పూల ఆంథోని హైదరాబాద్ అతి మేత్రాణులుచే తెలుగులో దివ్య బలిపూజ, మధ్యాహ్నం 2 గంటలకు స్వస్థత ప్రార్థనలు పాస్టర్ క్రీస్తురాజు బృందం, సాయింత్రం 4గంటలకు తేరు ప్రదక్షిణ, 5గంటలకు దివ్య సత్ప్రసాద ఆశీర్వాదము తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బాలయేసు మహోత్సవాలను పురస్కరించుకుని ఆర్టీసీ.. నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనుంది. ఎంజీబీఎస్ డిపో, మెహిదీపట్నం, నాంపల్లి, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి బాలయేసు క్షేత్రం వరకు స్పెషల్ బస్సులను నడపనున్నారు. ఇప్పటికే చర్చి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. వనస్థలిపురం పోలీసులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

వధువులకు సర్పంచ్ పెళ్లికానుక



వధువుకు ఆర్థికసాయం అందిస్తున్న సర్పంచ్ దంపతులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి, సత్యం దంపతులు గ్రామంలో వివాహం చేసుకునే అమ్మాయిలకు ఎన్నికల హామీలో భాగంగా రూ.10116 నగదును వివాహ కానుకగా ఇస్తున్నారు. ఇప్పటివరకు గ్రామంలో వివాహం జరిగిన 56 మంది వధువులకు పెళ్లికానుక అందించారు. గ్రామానికి చెందిన మంజుల, రాములు దంపతుల కుమార్తె పూజకు.. బక్కమ్మ, రామచంద్రయ్యగౌడ్ కుమార్తె శిరిషకు శుక్రవారం సర్పంచ్ దంపతులు రూ.10116 చొప్పున పెళ్లికానుకగా అందించారు. ఈ సందర్భంగా నూతన వధువుల దంపతులు సర్పంచ్ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉపసర్పంచ్ వెంకటయ్య, స్థానిక నాయకులు రమేశ్, సాయిలు, వెంకట్, యాదయ్య, వెంకట్, నర్సింహ, పర్వతాలు, గణేశ్, రాములు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భవానీరామలింగేశ్వరుని కల్యాణం



కల్యాణోత్సవంలోని ఓ ఘట్టం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణోత్సవం వైభంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయాన్ని, మండపాన్ని శోభాయమానంగా అలంకరించారు. అనంతరం పూజారులు మల్లికార్జునస్వామి, నయనాచారి, మల్లికార్జున్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కల్యాణోత్సవంలో ఆలయ నిర్మాణ దాత రేగట్టి శ్రీనివాస్, శ్రీలత, శ్రీకాంత్, సుష్మ, కౌసల్య, శ్రీను, సాయిలు, అశోక్, వెంకటయ్య, అంజయ్య, బాలస్వామి, కుమార్‌గౌడ్, యాది, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



తలకొండపల్లి: ఉపాధ్యాయులతో విద్యార్థులు

తలకొండపల్లి: మండల పరిధిలోని ఖానాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 17మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవరించారు. ప్రధానోపాధ్యాయులుగా బి.పావని, డీఈఓగా పి.చందన వ్యవహరించారు. అనంతరం సమావేశంలో విద్యార్థులు మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని.. భవిష్యత్‌లో ఉపాధ్యాయులు కావాలనే కోరిక ఉందని అన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకరయ్య, కర్ణారెడ్డి, గోపాల్, పీఈటీ మల్లేష్, సతీష్, బాలస్వామి, స్వాతి, శంకర్, ఎస్ఎంసీ చైర్మన్ జగన్, తదితరులు పాల్గొన్నారు.

అరబిందో హైస్కూల్‌లో..



ఆమనగల్లు: ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని అరబిందో హైస్కూల్‌లో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. విద్యాశాఖామంత్రిగా శ్రవన్‌కుమార్, విద్యాశాఖ కమిషనర్‌గా శ్రావణి, కలెక్టర్‌గా అక్షిత, జాయింట్ కలెక్టర్‌గా శ్రీవర్ష, డీఈఓగా స్రవంతి, డిప్యూటీ డీఈఓగా పవన్, ఎంఈఓగా కీర్తిశ్రీ, ఆర్‌జేడీగా రాంచరణ్, పాఠశాల ప్రిన్సిపాల్‌గా చిన్మయి, వైస్ ప్రిన్సిపల్‌గా సాయిచరణ్, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్లోక, అకడమిక్ అడ్వయిజర్‌గా కీర్తన వ్యవహరించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆమనగల్లు సీఐ ఉపేందర్, ఎంఈఓ సర్దార్‌నాయక్.. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అరబిందో హైస్కూల్ అకాడమిక్ అడ్వయిజర్ సుధీర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకమండలి ప్రమాణ స్వీకారం

హస్తినాపురం: దేవాలయం అభివృద్ధి కోసం అందరూ కలిసి కట్టుగా పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఆలయ ధర్మకర్తలపై ఉందని హరిహరక్షేత్ర అయ్యప్ప దేవాయల కమిటీ వ్యవస్థాపక చైర్మన్, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. హరిహరక్షేత్ర అయ్యప్ప దేవాలయం నూతన ధర్మకర్తలుగా నియమితులైన వారిని శుక్రవారం దేవాలయంలో నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం జగద్గురు విద్యారణ్య భారతి స్వామీజీ ఆశీస్సులతో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వంగామధుసూదన్ రెడ్డి సమక్షంలో చేశారు.

పన్నులు చెల్లించకుంటే దుకాణాలు సీజ్ చేస్తాం

మున్సిపల్ కమిషనర్ యూసుఫ్

ఇబ్రహీంపట్నం: పన్నులు సకాలంలో చెల్లించకుంటే దుకాణాలను సీజ్ చేస్తామని ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ హెచ్చరించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పన్ను వసూళ్ల స్పెషల్ డ్రైవ్‌లో సిబ్బందితో కలిసి ఆయన పాల్గొన్నారు. పన్నులు చెల్లించకుండా ఏడేళ్లుగా బకాయిపడ్డ ఓ షాపును సీజ్ చేశారు. పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని గేటుతండాకు చెందిన జగదీశ్ నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓవైసీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, పంతునాయక్.. జగదీశ్‌ను పరామర్శించారు. ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.8వేలను వారు బాధితుడికి అందించారు. బాధితులు ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నాయకులు రవి, తావుర్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కందుకూరు: మండల పరిధిలోని సార్లరావులపల్లిలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ రజితప్రవీణ్ శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. కందుకూరు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, కడ్తాల్ జెడ్పీటీసీ దశరథనాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్తీక్, మండల యూత్ అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సోషల్ మీడి యా కన్వీనర్ దీక్షిత్‌రెడ్డి తదితరులు భూమి పూజ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కవిత, వార్డుసభ్యులు సామ్య, గౌతమి, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర

బీఆర్ఎస్ యువనేత ప్రశాంత్ కుమార్‌రెడ్డి



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మంచాల: నియోజకవర్గంలోని ప్రజాసమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా పనిచేయడం కోసమే ప్రగతి నివేదన పాదయాత్ర చేపట్టినట్లు బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మంచాలలో ప్రగతి నివేదన పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా..? లేదా తెలుసుకోవడానికే గడప-గడపకు తిరుగుతున్నామన్నారు. మంచాల గ్రామంలో రూ.10లక్షతో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 80 వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి బహదూర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీ నర్మద, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ అనిరెడ్డి జగన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పావని వెంకటేశ్, జానీపాష, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, మండల అధ్యక్షుడు భద్రినాథ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంట విజయ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సికిందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రవి, నాయకులు పాల్గొన్నారు.

ఫార్మా భూసేకరణ పెద్ద కుంభకోణం

ఏఐసీసీ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



యాచారం: ఫార్మాసిటీ భూసేకరణలో పెద్ద కుంభకోణం జరిగిందని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి ఆరోపించారు. యాచారంలోని శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ఫార్మాసిటీ కోసం భూసేకరణ చేసిన యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 591 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమణ కింద చూపించి బినామీ పేర్లతో రూ.35 కోట్ల నిధులు స్వాహా చేసినట్లు ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద రూ.8 లక్షలకు ఎకరా అసైన్డ్ భూమి కొనుగోలు చేసిన ప్రభుత్వ పెద్దలు.. వ్యాపార సంస్థలకు ఎకరాకు రూ.కోటి 30 లక్షలకు అమ్ముకున్నట్లు ఆరోపించారు. ఫార్మాసిటీ భూసేకరణలో జరిగిన అక్రమాలను, ధరణి పోర్టల్‌లో జరిగే తప్పిదాలను సరిచేయకపోతే భూబాధితులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కొనసాగుతున్న కంటివెలుగు



ఇబ్రహీంపట్నం: వృద్ధురాలికి కళ్లద్దాలు అందజేస్తున్న కౌన్సిలర్ సుల్తాన్

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కంటివెలుగు శిబిరంలో 110 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిత విజయ్, సర్పంచ్ అంబర్‌సింగ్, డాక్టర్లు పరిక్షిత్ నరేందర్, మంజులాదేవి, సిబ్బంది తిరుపతిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

311 మందికి కంటి పరీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లి, వెల్జాల్‌లోని కంటి వెలుగు శిబిరంలో శుక్రవారం కంటి వైద్యులు 311 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 18 సంవత్సరాలు పైబడిన వారికందరికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు కల్పన, శ్వేత తెలిపారు. దృష్టి లోపాలున్నవారికి కళ్లద్దాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు రామకృష్ణ, మల్లిఖార్జున్, హెచ్ఎ మల్లయ్య, రామచంద్రయ్య, రవికుమార్, మాధవి, స్వాతి, నాగమల్లీశ్వరి ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం 6వ వార్డులో..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని 6వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, కౌన్సిలర్ ఎండీ.సుల్తాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నీలం బాలు, సొప్పరి కరుణాకర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

మాడ్గుల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదివిన 2022-23 బ్యాచ్ విద్యార్థులకు శుక్రవారం ఘ నంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మొ దటి సంవత్సరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సీనియర్లకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో అధిక దిగుబడి

మండల వ్యవసాయాధికారి శ్రీలత

కడ్తాల్: రైతులు జీవన ఎరువుల వాడకంపై దృష్టి సారించి సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మక్తమాదారం రైతు వేదిక కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల సాగుపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. భాస్వరాన్ని కరిగించు బ్యాక్టీరియాను వాడటం వల్ల నిరుపయోగంగా ఉన్న భాస్వరాన్ని మొక్కకు అందేలా చేస్తుందని అన్నారు. అదే విధంగా వరిలో కాండం తొలిచే పురుగు పిలకదశలో ఆశించి పంటకు తీవ్రంగా నష్టపరుస్తుందని.. దీని నివారణకు వరి నాటిన 15 నుంచి 40 రోజుల దశలో పైర్లలో కార్బోఫ్యూరాన్ 3జీ 10 కిలోలు (లేదా) కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ 4జీ లేదా, క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జీ 4కిలోలు ఎకరానికి చొప్పున 25 కిలోల పొడి ఇసుకతో కలిపి బురద పదునులో వేయాలని సూచించారు. సమావేశంలో ఏఈఓ రమణ, ఎంపీటీసీ మంజుల, రైతులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు తెలియజేయండి

- బీజేపీ రాష్ట్ర పార్లమెంటరీ సెక్రటరీ బాలసుబ్రహ్మణ్యం
- ప్రజాగోస-బీజేపీ భరోసా సమావేశంలో కార్యకర్తలకు దిశానిర్దేశం



ఇబ్రహీంపట్నం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, సంక్షేమ పథకాల్లో కేంద్ర వాటాపై ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఆపార్టీ రాష్ట్ర పార్లమెంటరీ సెక్రటరీ బాలసుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్ గ్రామంలో శుక్రవారం 'ప్రజాగోస-బీజేపీ భరోసా' శక్తి కేంద్రం కార్నర్ సమావేశం విట్టల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముందుగా గ్రామంలో బీజేపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి బాలసుబ్రహ్మణ్యం, దేవయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలయజేయాలన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీకి వస్తున్న నిధుల్లో కేంద్రం వాటా ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రబారీ అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పోరెడ్డి నర్సింహారెడ్డి, అర్జున్ రెడ్డి, కొత్త అశోక్‌గౌడ్, మండల అధ్యక్షులు శ్రీశైలం, అసెంబ్లీ కన్వీనర్ యాదిరెడ్డి, నాయిని సత్యనారయణ, నారయణ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మండల, బూత్‌స్థాయి నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తాం

ఆమనగల్లు: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావ్ అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయమని ఆయన అన్నారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె హరిప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రామచందర్‌రావ్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటు అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ హామీలను విస్మరించిందన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. నియంత పాలన సాగిస్తున్న కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచ్ తిప్పిరెడ్డి నర్సింహారెడ్డి, బీజేపీ కల్వకుర్తి ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, కోకన్వీనర్ నర్సింహ, నాయకులు తిప్పిరెడ్డిరాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంపాల్‌నాయక్, కాసుల వెంకటేశ్, లక్ష్మణ్‌రావ్, ఎర్రవోలు శ్రీను, శ్రీను, కొమరయ్య, రాఘవ పాల్గొన్నారు.